సాక్షి విజయనగరం

7

ఆదివారం । 14 । జూలై । 2024



న్యూస్‌రీల్

రామతీర్థంలో ప్రత్యేక పూజలు

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



యాగశాలలో హోమాలు జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరాకాండ హవనం జరిపించారు. అనంతరం స్వామివారి వెండి మంటపం వద్ద సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామీణ కళాకారుల సంఘం అధ్యక్షుడు పైడిరాజు ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన పలువురు కళాకారులు స్వామి సన్నిధిలో చేపట్టిన భక్తి భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు మడ్డువలస నీరు విడుదల



మడ్డువలస ప్రాజెక్టు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాముల నాయుడు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువకు ఆదివారం సాగునీరు విడుదల చేస్తామని డీఈ అర్జున్ తెలిపారు. ఖరీఫ్ పంటల సాగుకు ఆయకట్టు పరిధిలోని 30,700 ఎకరాలకు సాగునీరు అందిస్తామని వెల్లడించారు. ప్రాజెక్టులో 63.40 మీటర్ల నీటిమట్టం ఉండగా ప్రస్తుతం రెండు టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

భీమసింగి సుగర్ ఫ్యాక్టరీతో నష్టమే ఎక్కువ

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



లొట్లపల్లిలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

జామి: మండలంలోని భీమసింగి సహకార చక్కెర కర్మాగారం పునరుద్ధరణ వల్ల లాభం కంటే నష్టాలే ఎక్కువని మంత్రి కె.శ్రీనివాస్ స్పష్టంచేశారు. జామి మండలం లొట్లపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు శనివారం వచ్చిన ఆయనకు పలువురు రైతులు భీమసింగి చక్కెర కర్మాగారం తెరిపించాలని కోరారు. దీనికి ఆయన పై విధంగా స్పందించడంతో రైతులు అవాక్కయ్యారు. మన వద్ద ఉత్పత్తి అయిన చక్కెర ధర కంటే ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న చక్కెర తక్కువ ధరకే వస్తున్నట్టు సెలవిచ్చారు. కర్మాగారాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేయాలని, దీనివల్ల ప్రయోజనం కలగదన్నారు. ప్రత్నామ్నాయ పరిశ్రమ ఏర్పాటుకు కృషిచేస్తామని తెలిపారు. మంత్రి మాటలతో చెరకు రైతులు, కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల సమయంలో చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని చెప్పిన టీడీపీ నాయకులు ఇప్పుడు మాటమార్చుతున్నారంటూ ఆవేదన వ్యక్తంచేశారు.

ఉద్యోగ వర్గాలకు...

కూటమి వెన్నుపోటు

'ఎన్నికల హామీలను 99 శాతం అమలు చేశామని చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసిందా ఉద్యోగ తమ్ముళ్లూ.. జీపీఎస్ అని పేరుమార్చి మోసం చేసింది. మా ప్రభుత్వం వస్తే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడానికి పూర్తిగా శ్రద్ధ తీసుకుంటాం.. సాధ్యాసాధ్యాలను సమీక్షించి చర్యలు తీసుకుంటాం..'

– ఇదీ ఏప్రిల్ 24న ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయనగరం కలెక్టరేట్ కూడలిలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో కలిసి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు.

- ఎన్నికల హామీని విస్మరించడంపై మండిపాటు
- జీపీఎస్ అమలుకు వీలుగా గెజిట్ జారీపై భగ్గుమన్న ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు
- కలెక్టరేట్ ఎదుట గెజిట్ కాపీలు దహనం
- కూటమి మాటలు విని మోసపోయామంటూ ఆవేదన
- ఆందోళన బాటలో ఉమ్మడి విజయనగరం జిల్లా ఉద్యోగులు



జీపీఎస్‌కు అనుగుణంగా జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్ రద్దుచేయాలని విజయనగరం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు

విజయనగరం అర్బన్:

అధికారంలోకి వచ్చి నెలరోజులకే కూటమి నాయకులు మాటమార్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్‌గా ఉన్న పాత పెన్షన్ అమలు హామీని విస్మరించారు. ఉద్యోగలోకానికి వెన్నుపోటు పొడిచారు. గత ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) జీఓ 54ను కొనసాగిస్తూ కూటమి తాజాగా రాజముద్రతో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాలు మండిపడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఇంతగా మోసం చేస్తుందని ఊహించలేదంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మేము మారలేదు.. మమ్మలను నమ్మి మీరే మోసపోయారని సీఎం చంద్రబాబు మరోసారి నిరూపించారంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. ఉద్యమ కార్యాచరణ ప్రణాళికలకు రూపకల్పన చేస్తున్నారు.

మోసపోయిన 18 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో కంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానం 2004 సెప్టెంబర్ ఒకటి నుంచి అమలులో ఉంది. అప్పటి నుంచి ఇంత వరకు ప్రభుత్వ శాఖల్లో వివిధ కేడర్ ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయి విధులు నిర్వర్తిస్తున్న వారు 18 వేల మంది వరకు ఉమ్మడి జిల్లాలో ఉన్నారు. వీరిలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు. సీపీఎస్ విధానాన్ని తొలి దశలో ఆమోదించినప్పటికీ అమలులో ఎదురైన లోపభూయిష్ఠ ఆ విధానాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులు వ్యతిరేకించారు. తరువాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం వాళ్ల వ్యతిరేకతను గుర్తించలేదు. ఆ తరువాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీపీఎస్ రద్దు సాధ్యం కాదని, ఉద్యోగ సంఘాలతో సమీక్షించాక ప్రత్యామ్నాయ మార్గంగా జీపీఎస్‌ను తీసుకొచ్చింది. దీనిని కొంతమంది ఉద్యోగులు వ్యతిరేకించారు. ఎన్నికల సమయంలో ఈ అంశాన్ని చంద్రబాబునాయుడు బాగా ఉపయోగించుకున్నారు. సీపీఎస్ రద్దు అంశాన్ని పరిశీలిస్తామని, ఉద్యోగులకు మేలు చేస్తామంటూ నమ్మించారు. వారి మద్దతుతో అధికారంలోకి వచ్చాక మాట మార్చడంతో ఉద్యోగుల్లో కలవరం మొదలైంది.

కూటమి ఇంత మోసం చేస్తుందని ఊహించలేదు



కూటమి ఎన్నికల మానిఫెస్టోలోని హామీల్లో ఉద్యోగులకు ఇచ్చిన వాటిలో కీలకమైనది సీపీఎస్ ఉద్యోగులకు పాతపెన్షన్ అమలు చేయడం. గత ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోకపోవడంతో వ్యతిరేకించాం. ఎన్నికల ప్రచారంలో కూటమి విస్తృత స్థాయిలో ప్రచారం చేసింది. అమలు చేస్తుందని ఆశ పడ్డాం. నెలరోజులు కాక ముందే గత ప్రభుత్వం ఇచ్చిన జీఓనే తాజాగా రాజముద్ర వేసి గెజిట్ విడుదల చేసింది. ఉపాధ్యాయ, ఉద్యోగుల ఓట్లకోసమే ఎన్నికల్లో మోసపూరిత హామీ ఇచ్చినట్టు రుజువైంది. ఇంత మోసం చేస్తుందని ఊహించలేదు. – **జేపీవీఆర్‌కే ఈశ్వరరావు, జిల్లా ప్రధానకార్యదర్శి, యూటీఎఫ్**

ఏకపక్షంగా జీఓ జారీచేయడం దారుణం



పాత పెన్షన్ అమలు చేమలు చేస్తామని కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టింది. గత ప్రభుత్వం జీఓ చేసిన కొత్త జీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇవ్వడం వల్ల కూటమి నమ్మి ఉద్యోగులు అధిక సంఖ్యలో ఓట్లు వేసి గెలిపించారు. కనీసం సాధ్యాసాధ్యాలపై ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సమీక్షించకుండా గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ 54కు రాజముద్ర వేసి గెజిట్‌ను విడుదల చేయడం దారుణం. ఎప్పటిలాగే ఉపాధ్యాయ, ఉద్యోగుల హామీలను విస్మరించే విధానాన్ని టీడీపీ నాయకులు అవలంబించారు. జీఓ 54కు సంబంధించిన గెజిట్‌ను తక్షణమే రద్దు చేయాలి.

– **డి.రాము, రాష్ట్ర కార్యదర్శి, యూటీఎఫ్**

ఆశలు నీరుగార్చారు



కూటమి ఎన్నిక మేనిఫెస్టోలో జీపీఎస్ రద్దు హామీ ఉంది. పాత పెన్షన్ విధానాన్ని కూటమి అమలు చేస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. కనీసం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా గత ప్రభుత్వం ఇచ్చి జీఓ 54నే ఆమోదిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణం. ఉద్యోగ, ఉపాధ్యాయులు దిగ్భ్రాంతి చెందుతున్నారు. జిల్లాల వేల సంఖ్యలో ఉన్న ఉద్యోగులను సీఎం చంద్రబాబునాయుడు నిరాశ పర్చారు. ఇప్పటికైనా తాజా గెజిట్‌ను రద్దు చేసి సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి.

– **సీహెచ్ తిరుపతిరావు, జిల్లా కార్యదర్శి, యూటీఎఫ్**

కలెక్టరేట్ ఎదుట గెజిట్ కాపీలు దహనం

సీపీఎస్ స్థానంలో తీసుకొచ్చిన జీపీఎస్ గెజిట్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, జీఓ 54ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్ చంద్రపట్నాయక్, జేపీవీఆర్‌కే ఈశ్వరరావులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద శనివారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. అనంతరం గెజిట్ కాపీని దహనం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాము, నాయకులు కె.శ్రీనివాసరావు, కె.ప్రసాదరావు, తిరుపతినాయుడు, సత్యనారాయణ, రాజారావు, పి.రాంప్రసాద్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్పీగా వకుల్ జిందాల్



వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం



మలికా గార్గ్, ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ కమాండెంట్

విజయనగరం క్రైమ్: జిల్లాకు కొత్త ఎస్పీగా వకుల్ జిందాల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 37 మంది ఐపీఎస్‌లను బదిలీలు చేశారు. దీనిలో భాగంగా విజయనగరం ఎస్పీగా పనిచేసిన ఎం.దీపికను అనకాపల్లి ఎస్పీగా బదిలీ చేశారు. బాపట్లలో ఎస్పీగా పనిచేసిన వకుల్ జిందాల్‌ను విజయనగరం ఎస్పీగా నియమించారు. వకుల్ జిందాల్ సివిల్స్–2016 బ్యాచ్‌కు చెందినవారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ ఢిల్లీ)లో 2013లో బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేశారు. రంపచోడవరం, కృష్ణా జిల్లాలో అదనపు ఎస్పీగా, విజయవాడలో సీఎం పర్సనల్ సెక్యూరిటీ వింగ్‌లో పనిచేవారు. అలాగే, పల్నాడు ఎస్పీగా పనిచేస్తున్న మలికా గార్గ్ విజయనగరం చింతలవలస ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. వకుల్‌జిందల్, మాలికా గార్డ్ దంపతులు.

సమష్టిగా ముందుకు సాగుదాం

- రాజకీయాల్లో గెలుపోటములు సహజం
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ మంత్రి రాజన్నదొర



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

విజయనగరం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలందరం ఒకే కుటుంబంలా కలిసిమెలసి ముందుకు సాగుదామని పార్టీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. జెడ్పీ కార్యాలయ ప్రాంగణంలో శనివారం జరిగిన వైఎస్సార్‌సీపీ సాలూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోవటములు సహజమని, ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యతగా పార్టీకి అండగా నిలవాలని సూచించారు. పార్టీ ఓటమి వల్ల ఎవరూ కుంగిపోవాల్సిన అవసరం లేదని, కార్యకర్తలు, నాయకులకు అన్ని విధాల అండగా ఉంటామని భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీల అమల్లో భాగంగా అర్హులైన వారందరికీ పథకాలు అందించడంలో కీలక పాత్ర పోషించాలన్నారు. ఇదే సందర్భంలో టీడీపీ అరాచకాలు అక్కడక్కడ మితిమీరుతున్నాయని, కక్ష సాధింపు చర్యలు చేపట్టడం మాని అభివృద్ధిపై దృష్టి సారించాలా పని చేయాలన్నారు. సమావేశంలో సాలూరు, పాచిపెంట మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండలాధ్యక్షులు, వైస్ ఎంపీపీలు, జేసీఎస్ కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన సాలూరు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

ప్రయాణ యాతన

- అధ్వానంగా మారిన పార్వతీపురం–కూనేరు అంతర్‌రాష్ట్ర రోడ్డు
- మరమ్మతులకు గురవుతున్న వాహనాలు
- ఆందోళనలో వాహనయాజమానులు, డ్రైవర్లు



కొమరాడ సమీపంలో అంతర్‌రాష్ట్ర రహదారిపై బురదలో కూరికుపోయిన లారీ

కొమరాడ: పార్వతీపురం–కూనేరు అంతర్‌రాష్ట్ర రహదారి అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడే గోతులమయమైంది. కొన్నిచోట్ల ఏకంగా బురదమయం కావడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఒడిశా, రాయపూర్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లోని పరిశ్రమలకు ముడి సరుకును తరలించే లారీలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయంటూ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొమరాడ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన భారీ గోతిలో రోజుకోలారీ కూరుకుపోతున్నా పట్టించుకునేవారే కరువయ్యారని వాపోతున్నారు. శనివారం వేకవజామున ఓ భారీ లారీ గోతిలో కూరుకుపోవడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. గత్యంతరం లేక లారీ డ్రైవర్లు కొద్దిపాటు డబ్బులు పోగుచేసుకుని జేసీబీ సాయంతో బురదలో కూరుకుపోయిన లారీని బయటతీసి రోడ్డుపై ఉన్న గోతిని రాళ్లతో పూడ్చారు. ఇంత జరుగుతున్నా రహదారుల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై వాహనచోదుకులు మండిపడుతున్నారు. రోడ్డును బాగుచేసేందుకు ప్రభుత్వం చొరవచూపాలని కోరుతున్నారు.

మాతృశాఖకు పంపండి

బొబ్బిలి: సచివాలయాల్లో అడ్మిన్‌లుగా పనిచేస్తున్న మున్సిపల్ బిల్ కలెక్టర్లను మాతృశాఖకు అప్పగించాలని రాష్ట్ర బిల్ కలెక్టర్ల అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జీఎం ఖాన్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బేబినాయనను శనివారం కలసి వినతిపత్రం అందజేశారు. సచివాలయాల వ్యవస్థ ప్రారంభం నుంచి అడ్మిన్ బాధ్యతలు చేపడుతున్నామని, అక్కడ పూర్తిస్థాయిలో స్టాఫ్ ఉన్నారని, తమను మాతృశాఖకు బదలీచేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట పలువురు బిల్ కలెక్టర్లు ఉన్నారు.

పొమ్మనలేక పొగ!

- సచివాలయాల్లో డిజిటల్ సేవలకు అంతరాయం
- డిజిటల్ అసిస్టెంట్‌లకు మంగళంపాడే ఆలోచనలో సర్కారు!
- ఈ సేవలన్నీ మీ సేవా కేంద్రాలకు..
- సచివాలయ పని వేళల్లో పనిచేయని సర్వర్
- ఇప్పటికే నిలిచిపోయిన 40 రకాల సేవలు
- మీ సేవా కేంద్రాలకు వెళ్తున్న ప్రజలు
- అయోమయంలో డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగులు
- ఇదే తోవలో వెల్ఫేర్ అసిస్టెంట్‌ల పరిస్థితి
- సచివాలయాల్లో సేవలు అందకపోవడంపై ప్రజల్లో ఆందోళన

రాజాం:

ఉన్న ఊరిలో.. ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజలకు అందే సేవలు ఇటీవల కాలంలో నెమ్మదించాయి. పొమ్మనలేక పొగబెట్టే మాదిరి సచివాలయ వ్యవస్థలో ప్రభుత్వం మార్పులు చేస్తోందన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. సచివాలయ సేవలు నిలిపివేసినట్టు ప్రజలకు తెలియకుండా ఉండేందుకు సర్వర్ పనిచేయకుండా ప్రభుత్వమే చేస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. గత నెలరోజులుగా సచివాలయ సేవల్లో డిజిటల్ సేవలకు ఆటంకం ఏర్పడింది. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు 200 రకాల పత్రాలు పొందేందుకు గత ప్రభుత్వం గ్రామ స్థాయిలో సచివాలయాలు ఏర్పాటుచేసి, డిజిటల్ అసిస్టెంట్ వ్యవస్థను రూపొందించింది. దరఖాస్తు దగ్గర నుంచి పత్రం మంజూరీ వరకూ డిజిటల్ అసిస్టెంట్ ద్వారా సేవలు అందించింది. ప్రభుత్వం మారిన వెంటనే ఈ సేవల్లో తాత్కాలికంగా అంతరాయం కనిపిస్తోంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ సేవలు అందించే సర్వర్ పనిచేయడం లేదు. దీంతో సచివాలయాలకు వచ్చే ప్రజలు మీ సేవా కేంద్రాలకు వెళ్లి అక్కడ దరఖాస్తు చేసుకుని, అక్కడే పత్రాలు పొందుతున్నారు.

కుదించేందుకు ఎత్తుగడ..

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ గత ప్రభుత్వంలో ప్రజలకు మంచి సేవలు అందించింది. ఈ సచివాలయాలు ద్వారా ప్రజలకు గ్రామాల్లోనే సేవలు అందించేందుకు ఒక్కో రకమైన సేవకు ఒక్కోరకమైన అసిస్టెంట్ ఉద్యోగిని ప్రభుత్వం నియమించింది. పదిరకాల సేవలకు పదిమంది ఉద్యోగులు గ్రామ సచివాలయంలో ఉండేవారు. ఇందులో డిజిటల్ అసిస్టెంట్‌ది ప్రధాన పాత్రగా ఉండేది. గతంలో మండల కార్యాలయాలు చుట్టూ పలు ధ్రువీకరణ పత్రాలకు ప్రజలు తిరిగేవారు. అలా కాకుండా గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌ను సంప్రదించగానే అక్కడే ఆన్‌లైన్ ద్వారా కుల, ఆదాయ, జనన, మరణ, ఫ్యామిలీ మెంబర్, రైతుల పట్టాదారు పాసుపుస్తకాలు, 1బీ అడంగల్ వంటి పత్రాలకు దరఖాస్తు చేసి సకాలంలో అందించేవారు.



సేవల్లో అంతరాయం కలుగుతున్న సత్యనారాయణపురం సచివాలయం

ప్రస్తుతం ఈ ఉద్యోగి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాల్సిన పోర్టల్ సర్వర్ సరిగా పనిచేయడం లేదు. సరిగ్గా సచివాలయ పని సమయాల్లో సర్వర్ డౌన్ అవ్వడం, ఎర్రర్ రావడం జరుగుతోంది. దీనిని బాగుచేసేందుకు ప్రభుత్వం చొరవచూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మధ్యాహ్నం 4 గంటల సమయంలో మాత్రమే పనిచేస్తోంది. ఈ లోగా సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఇక్కడ దరఖాస్తు చేసుకోలేక మీ సేవా కేంద్రాలకు వెళ్తున్నారు. సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్ పోస్టు గత నెలరోజులుగా దిష్టిబొమ్మలా మారింది. కొత్త ప్రభుత్వ పథకాలు లేకపోవడం, అత్యవసర సేవలన్నీ పంచాయతీ కార్యదర్శులకు అప్పగించడంతో వెల్ఫేర్ అసిస్టెంట్ సేవలకు బ్రేక్ పడింది. ఈ ఉద్యోగాలను తగ్గించి, వీరిని వేరే చోటకు పంపించే ఆలోచనలో భాగంగానే వీరి సేవలకు ప్రభుత్వం అంతరాయం కలిగిస్తోందన్న ప్రచారం సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో సకాలంలో సేవలందించిన సచివాలయాలు, ఇప్పుడు ప్రజలకు సకాలంలో సేవలు అందించలేకుండా చేసి, వాటిపై ప్రజల్లోకి తప్పుడు ప్రచారాన్ని పంపించే దిశగా ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

పరుల పేరున కొండకామేశ్వరుని భూములు

- లెక్కకు దొరకని 17.88 ఎకరాలు
- ఇందులో 3.45 ఎకరాల భూమికి అడ్డదారిలో మ్యుటేషన్
- ఆందోళనలో భక్తులు



కొండకామేశ్వర ఆలయ భూముల వివరాలు సేకరిస్తున్న దేవదాయశాఖ అధికారులు

రాజాం/సంతకవిటి: సంతకవిటి మండలం సిరిపురం గ్రామంలో ప్రాచీన కొండకామేశ్వర ఆలయ ఆస్తులు రికార్డుల్లో అదృశ్యమయ్యాయి. దేవాలయాల్లో నగలు, హుండీల్లోని భక్తుల కానుకలు మాయం చేసినట్టే ఆస్తులను మాయం చేయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. 2014 వరకు రెవెన్యూ రికార్డుల్లో ఉన్న ఈ ఆస్తుల వివరాలు ఇప్పుడు కనిపించకపోవడంతో సిరిపురం గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన కొండకామేశ్వరుని భక్తులు ఆందోళన చెందుతున్నారు.

అప్పట్లో మార్పులు...ఇప్పుడేమో కబ్జాలు...

సిరిపురం తామరచెరువుగట్టు కొండపై రెండు శివాలయాలు ఒకేచోట ఉండడం ఇక్కడ విశేషం. ఈ ఆలయాల నిర్వహణకు 18వ శతాబ్దంలో సిరిపురం, వావిలవలస ఎస్టేట్‌ల యజమానులు 17.88 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ భూమి 2014 వరకూ సంతకవిటి రెవెన్యూ రికార్డుల్లో కొండకామేశ్వర స్వామి పేరుమీద ఉండేది. 2014లో ఇదే గ్రామానికి చెందిన ఆలయ అర్చకులుగా ఉంటున్న పేకల పార్వతి పేరుమీద 3.45 ఎకరాలు బదిలీ అయింది. వంశపారంపర్యంగా ఈభూమి సక్రమించినట్టు రికార్డుల్లో నమోదుచేసి, పార్వతిపేరుమీద పాస్‌పుస్తకాలు తయారయ్యాయి. దీంతో గ్రామంలో అలజడి ప్రారంభమైంది. ఆలయ నిర్వహణ నిమిత్తం ఇచ్చిన ఈ భూములు ఇప్పుడు ఇలా ప్రైవేటు వ్యక్తుల పేరుమీదకు బదిలీ కావడం అనుమానాలకు తావిస్తోంది. మిగిలిన భూమి వివరాలు రికార్డుల్లో కనిపించకపోవడం భక్తులను కలవరపరుస్తోంది. 2014లో ప్రైవేట్ వ్యక్తుల పేరు మీద ఈ భూములు మారగా, ఇప్పుడు ఆయా వ్యక్తులు ఈ భూముల్లో పామాయిల్ తోటలు వేసి భూములు సొంతంచేసుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇటీవల గ్రామస్తులు విజయనగరం దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదుచేయగా, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి, రాజాం ఈఓ మాధవరావు తదితరులు ఈ భూములు పరిశీలించారు. పామాయిల్ మొక్కలు వేస్తున్న భూములు రెవెన్యూ ఎస్‌ఎల్‌ఆర్ రికార్డుల్లో దేవాలయాలు పేరుమీద ఉన్నాయని, వాటిని ఆక్రమించవద్దని ఆదేశాలు జారీచేసినా, ఆక్రమణదారులు వెనక్కుతగ్గలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, ఆలయ భూములను స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భూములు పరిశీలించాం

సిరిపురం గ్రామంలో కొండకామేశ్వర ఆలయానికి సంబంధించి 17.88 ఎకరాల భూమిని అప్పట్లో వావిలవలస, సిరిపురం ఎస్టేట్ జమిందారీలు కేటాయించారు. సిరిపురం జమిందారీలు ఇచ్చిన భూములు చాలాచోట్ల దేవదాయశాఖ పరిధిలో ఉండగా, ఇక్కడ ఆక్రమణల్లో ఉన్న విషయాన్ని గుర్తించాం. ఆలయ అర్చకులు కేవలం అనుభవించాలే తప్ప ఆక్రమణలు చేసి, భూములు తమ పేరుమీద రాయించుకోరాదు. ఇక్కడ భూములు వివరాలు మొత్తం బయటకు తీసి, ఆలయం పేరు మీద మార్చుతాం.

– **బీవీ మాధవరావు, దేవదాయశాఖ రాజాం ఈఓ**

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి రూరల్: చీపురుపల్లి పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయానికి బొద్దాంకు చెందిన మణికంఠ పేపర్ ఇండస్ట్రీస్ యాజమాన్యం వెల్లంపాటి చిట్టిమహేష్, హరిత కుటుంబ సభ్యులు లక్ష రూపాయలు విరాళం అందించారు. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు ఈ మొత్తాన్ని శనివారం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్‌విజి.శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, దాసరి రవిశంకర్, దిలీప్‌కుమార్, దనుక, గుడ్ల శ్రీనివాసరావు, ఒమ్మి రమేష్, గొల్ల స్వామి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు



గాయాల పాలైన యువకుడు

చీపురుపల్లి రూరల్: పట్టణంలోని జగన్నాధరాజు కాలనీకి చెందిన యువకుడు మండా రాకేష్ బైకుపై నుంచి జారిపడి గాయాల పాలయ్యాడని ఎస్‌ఐ కిరణ్‌కుమార్‌నాయుడు శనివారం తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో గల బజాజ్ షోరూం వద్ద కుక్క అడ్డుగా రావటంతో బైకు అదుపు తప్పి కింద పడిపోయాడని పేర్కొన్నారు. గాయాల పాలైన క్షతగాత్రుడిని చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం విజయనగరం ఆస్పత్రికి రిఫర్ చేశారని తెలిపారు.

కుక్కల దాడిలో మేక పిల్లల మృతి



కుక్కల దాడిలో మృతిచెందిన మేక పిల్లలు

రాజాం సిటీ: పట్టణ పరిధి మల్లయ్యపేటలో మేకపిల్లల గుంపుపై కుక్కలు దాడి చేశాయి. ఎప్పటిలాగే కోడిబోయిన నగేష్ తన మేక పిల్లలను ఆరుబయట ఉంచాడు. శనివారం వేకువజామున జరిగిన కుక్కల దాడిలో 15 పిల్లలు మృతి చెందాయి. జీవనాధారంగా పెంచుకుంటున్న మేక పిల్లలు ఇలా మృతి చెందడంతో లబోదిబోమంటున్నాడు. అధికారులు స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయాలపాలైన కె.రామాంజనేయుల వర్మ

పార్వతీపురం టౌన్: లారీ ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన పార్వతీపురం పట్టణంలో చోటు చేసుకుంది. జిల్లా ఆస్పత్రి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం బెలగాం వివేక్ కాలనీకి చెందిన కె.రామాంజనేయుల వర్మ టీవీ రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం తన బైక్‌పై బెలగాం నుండి పాతబస్టాండ్‌కి వెళ్తుండగా మార్గమధ్యంలో సూర్యబుక్ స్టోర్‌కి కోణార్క్ స్వీట్‌కి మధ్య మెయిన్ రోడ్డుపైకి వచ్చేసరికి నర్సిపురం వైపు నుండి కొమరాడ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో వర్మ తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్నేహితులు 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

పార్వతీపురం టౌన్: పొలంలో వేసే గాబు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన సూడిగాం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. జిల్లా ఆస్పత్రి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. అదే గ్రామానికి చెందిన టి.గౌరునాయుడు భూమి విషయంలో తన సోదరితో గొడవ పడ్డాడు. ఈ విషయమై ఆమె అల్లుడు మాటిమాటికి ఇబ్బంది పెడుతున్నాడని మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న గాబు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు చికిత్సను అందించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹115	₹210	₹220

రామా.. కనవేమిరా...!

- రామతీర్థంలో యథేచ్ఛగా ఆక్రమణలు
- శాశ్వత షెడ్డుల నిర్మాణంతో ఉత్సవాల్లో ఇబ్బందులు
- ఈఓ కార్యాలయ సమీపంలో అక్రమ నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న దేవస్థానం అధికారులు



స్వామి పల్లకి సేవ జరిగే మార్గంలో అక్రమ షెడ్డు నిర్మాణం



రామతీర్థం దేవస్థానం

నెల్లిమర్ల రూరల్: ఉత్తరాంధ్రలో అతి పెద్ద పురాతన ఆలయంగా పేరొందిన రామతీర్థం దేవస్థానంలో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఒకరిని చూసి మరొకరు దేవస్థాన, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తూ అక్రమ నిర్మాణాలను యథేచ్ఛగా సాగిస్తున్నారు. దేవస్థానం అధికారులు, సిబ్బంది, పంచాయతీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ఏకంగా శాశ్వత షెడ్డులను ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా దేవస్థాన కార్యనిర్వాహణ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే స్వామివారి పల్లకి సేవ జరిగే మార్గంలో శాశ్వత షెడ్డును ఏర్పాటు చేస్తున్నప్పటికీ అధికారులు, సిబ్బంది చోద్యం చూస్తున్నారే తప్ప ఆక్రమణలకు అడ్డుకట్ట వేసే చర్యలు తీసుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సవాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు

రామతీర్థంలో ఆక్రమణల వలన ప్రతి ఏటా స్వామి వారికి జరిపిస్తున్న ఉత్సవాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తిరుక్కల్యాణ మహోత్సవంలో స్వామికి మూడు వాహనాల సేవను వైభవంగా జరిపిస్తుంటారు. షాపులు రహదారిపైకి విస్తరించడంతో వాహనాలను తిరు వీధుల్లో ఊరేగించేందుకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. చేసేదేమీ లేక ఒక్కోసారి వాహన సేవను కూడా నిలుపుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే స్వామి వారి రథయాత్ర మహోత్సవంలో కూడా రథం తిరిగేందుకు అవాంతరాలు ఏర్పడుతున్నాయి. గడిచిన మూడేళ్లుగా రథం ఆలయం వద్దకు తేలేక కూత వేటు దూరంలో నిలిపివేయాల్సిన పరిస్థితి దాపురించింది. గతంలో స్వామి సేవకు ఆటంకం ఉండేది కాదని, ప్రస్తుతం ఆక్రమణల కారణంగా ఉత్సవాల సమయాల్లో ఆటంకం ఏర్పడుతుందని భక్తులు చెబుతున్నారు.

వీఐపీలకు తప్పని ఇక్కట్లు

రామతీర్థం ఆలయాన్ని సందర్శించేందుకు హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జిలు, మంత్రులు, ఎమ్మెల్యేలు తరుచూ వస్తుంటారు. ఆక్రమణల వలన రహదారి ఇరుకుగా మారడంతో వారి వాహనాలు రహదారిపైనే నిలుపుదల చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఆక్రమణలను పూర్తి స్థాయిలో తొలగించి మాడ వీధులుగా తయారు చేస్తే ఇబ్బందులు తప్పుతాయని భక్తులు చెబుతున్నారు. ఆక్రమణదారులకు దేవస్థాన అధికారులు, సిబ్బంది పరోక్షంగా సహకరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

దేవస్థానం చుట్టూ ఆక్రమణలే

తూర్పు రాజగోపురం ఎదుట పలువురు వ్యాపారులు ఎటువంటి అనుమతులు లేకుండా శాశ్వత షెడ్డులను నిర్మించారు. సుమారు 20కు పైగానే షాపులు వెలియడంతో భక్తులు ఆ మార్గంలో వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాలన్నీ పంచాయతీ పరిధిలో ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. పంచాయతీ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా నిర్వాహకులు శాశ్వత నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. దేవస్థానానికి సమీపంలో ప్రధాన రహదారిలో కూడా ఏకంగా రహదారిపైకే నిర్మాణాలు చేపట్టి ఇబ్బందులు కలిగిస్తున్నారని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ పరిధిలోనిదే...



స్వామి పల్లకి సేవ జరిగే మార్గంలో శాశ్వత షెడ్డు ఏర్పాటు చేస్తున్నారని మా దృష్టికి వచ్చింది. ఎప్పటి నుంచో షాపు అక్కడ ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. ఆ స్థలం పంచాయతీ పరిధిలో ఉందని అంటున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– వై.శ్రీనివాసరావు, ఈఓ, రామతీర్థం దేవస్థానం

జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల జట్ల ఎంపిక



ఎంపికైన సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామ జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొన్నారు. ఎంపికైన మహిళా, పురుషుల జట్లు ఆగస్టు 10, 11, 12 తేదీలలో చిత్తూరు జిల్లా పుత్తూరులో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సుంకరి సాయిరమేష్ మాట్లాడుతూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే బేబినాయన ఆశీస్సులతో క్రీడాకారుల ఎంపిక పూర్తి చేశామన్నారు. ఎంపికలో పాఠశాలల పీడీలు బంగారు నాయుడు, వెంకటనాయుడు, సత్యనారాయణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో ప్రొటోకాల్ రగడ

- ప్రొటోకాల్ మరుస్తున్న అధికారులు
- కార్యక్రమం తెలుసుకుని వెళ్లాల్సిన దుస్థితిలో కూటమి నాయకులు
- అధిష్టానం వద్ద తేల్చుకుంటామంటున్న నేతలు



కొండపేటలో స్టూడెంట్ కిట్‌లు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు(ఫైల్)

నెల్లిమర్ల: ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని పలువురు ప్రజా ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే సాక్షిగా జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమానికి సాక్షాత్తు నగర ప్రథమ పౌరురాలైన నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినికి సమాచారం లేదంటే అధికార యంత్రాంగం ప్రొటోకాల్ పాటించడం లేదని తెలుస్తోంది. అయితే నగర పంచాయతీ చైర్‌పర్సన్ కార్యక్రమం తెలుసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సదరు కార్యక్రమంలో చైర్‌పర్సన్ తరపున జనసేన నాయకులు ప్రొటోకాల్‌పై ప్రశ్నిస్తే అధికారులు సమాధానం చెప్పకుండా మిన్నకుండిపోయారు. అంతకు ముందు కూడా 2, 3 వార్డుల పరిధిలోని కొండపేటలో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. అప్పుడు కూడా చైర్‌పర్సన్‌కి అధికారులు కనీసం సమాచారం ఇవ్వకుండా కార్యక్రమం నిర్వహించారు. అలాగే జూలై నెలకు సంబంధించి నగర పంచాయతీలో పింఛన్ల పంపిణీలో కూడా ప్రొటోకాల్ ప్రకారం ఆయా వార్డుల కౌన్సిలర్లకు కూడా చెప్పకుండా కార్యక్రమం జరిపించారు. దీంతో వైఎస్సార్‌సీపీకి చెందిన కౌన్సిలర్‌లు నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. కాగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ యంత్రంగా ప్రొటోకాల్‌తో సంబంధం లేకుండా ఇష్టం వచ్చిన వారికి సమాచారం ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. గతంలో కూడా నగర పంచాయతీ చైర్‌పర్సన్ విషయంలో ప్రొటోకాల్ పాటించలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారినా ప్రొటోకాల్ మాత్రం పాటించలేదు. ప్రొటోకాల్ విషయంపై అధిష్టానం వద్ద తేల్చుకుంటామని చెబుతున్నారు.

అధికార లాంఛనాల నడుమ అమర జవాను అంత్యక్రియలు



అమర జవాను శంకరరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న భార్యాబిడ్డలు,తల్లిదండ్రులు

బాడంగి: అమర జవాను గొట్టాపు శంకరరావు భౌతిక కాయానికి అధికార లాంఛనాల నడుమ శనివారం స్వగ్రామం బొత్సవానివలసలో అంత్యక్రియలు జరిగాయి. శంకరరావు జమ్ముకశ్మీర్‌లోని లడక్ ప్రాంతంలో సిలెండర్ పేలిన ప్రమాదంలో గురువారం మృతి చెందగా ఆయన భౌతికకాయాన్ని శనివారం స్వగ్రామం తీసుకువచ్చారు. తను పని చేసిన బెటాలియన్ నుంచి ఓ అధికారి రాగా.. విశాఖకు చెందిన బెటాలియన్ నుంచి పలువురు హాజరై ఆయన భౌతికకాయంపై జాతీయ జెండాను అవనతం చేశారు. అనంతరం అంత్యక్రియల సందర్భంగా బెటాలియన్ పోలీసులు మూడుసార్లు గాలిలోకి తుపాకులు పేల్చి అధికార లాంఛనాల నడుమ అంత్యక్రియలు చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ ఎమ్మెల్యేలు తెంటు లక్ష్మునాయుడు, శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అమర జవాను భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. భార్య కోమలిలత, తల్లిదండ్రులను ఓదార్చారు. ప్రభుత్వపరంగా తమ వంతు సాయం చేస్తామని ఎమ్మెల్యే బేబీనాయన భరోసా ఇచ్చారు.

దగ్గరకొచ్చేస్తానని.. దూరమయ్యాడు...

శంకరరావు మరో ఏడు నెలల్లో పదవీ విరమణ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో ఇటీవల కుటుంబ సభ్యులకు తను మరో ఏడు నెలల్లో వచ్చేస్తానని అంతా ఒక్కటిగా ఉందామని చెప్పాడని, ఇంతలోనే అందనంత దూరాలకు వెళ్లిపోయాడని భార్య కోమలిలత, తల్లిదండ్రులు అప్పలనాయుడు, సావిత్రమ్మ రోదించారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉండే శంకరరావు ఇలా దూరమైపోతాడని అనుకోలేదని విలపించారు. శంకరరావుకు ఇద్దరు చిన్నారులు ఉండడంతో తమ తండ్రికి ఏమైందో తెలియని పరిస్థితుల్లో బిక్కచూపులు చూస్తుండడం అక్కడి వారిని కన్నీరు పెట్టించింది.

గురుకులాల జిల్లా కోఆర్డినేటర్‌గా ఫ్లోరెన్స్



ఫ్లోరెన్స్‌కు అభినందనలు తెలుపుతున్న ఉమ్మడి జిల్లా గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు

వేపాడ: గురుకుల పాఠశాలల ఇన్‌చార్జి జిల్లా కో ఆర్డినేటర్‌గా వేపాడ ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.ఫ్లోరెన్స్ నియమితులయ్యారు. ఈ మేరకు ఫ్లోరెన్స్‌ను విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు శనివారం అభినందించారు. ఇప్పటి వరకు జిల్లా కోఆర్డినేటర్‌గా పని చేసిన పద్మజను చిత్తూరు జిల్లా కో ఆర్డినేటర్‌గా నియమించారు. కాగా వేపాడ గురుకుల బాలికల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పీజీటీగా పని చేస్తున్న ఉపాధ్యాయిని ఉషారాణిని నియమించారు.

విపత్తుల నిర్వహణపై వర్క్‌షాపు



సెంచూరియన్ వర్సిటీలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై సావనీర్ విడుదల చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

పర్లాకిమిడి: ఒడిశాలో 1999 అక్టోబరులో సంభవించిన సూపర్ సైక్లోన్.. దేశంలో విపత్తుల నిర్వహణకు నాందిపలికిందని జాతీయ విపత్తుల నిర్వాహణ సంస్థ (ఎన్.ఐ.డి.ఎం) డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రకాష్ అన్నారు. స్థానిక సెంచూరియన్ వర్సిటీలోని ఆడిటోరియంలో శనివారం 'విపత్తుల నిర్వహణ, వాటి తీవ్రత తగ్గించడానికి ఆధునిక టెక్నాలజీ, పనిముట్లు' అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఇస్రో సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో సెంచూరియన్ వర్సిటీ డీన్ డాక్టర్ ప్రఫుల్లకుమార్ పండా, ఐ.ఎం.డీ. మాజీ డైరెక్టర్ (భువనేశ్వర్) డాక్టర్ శరత్ చంద్ర సాహు, సివిల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ రాజీవ్ కుమార్ మాఝి, రిజిస్ట్రారు డాక్టర్ అనితా పాత్ర్, ప్రొఫెసర్ విక్రం నారాయణ్ విచ్చేశారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఒడిశాలో 2016లో సంభవించిన తిత్లీ తుఫాన్ ధాటికి గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ అతలాకుతలమైందని, కొండ చరియలు విరిగిపడి 36 మంది మరణించారని గుర్తు చేశారు. జపాన్‌లోని ఫుకోషిమా వద్ద న్యూక్లియర్ పరీక్షలు చేసిన తరువాత సునామీ సంభవించిందని, దీనివల్ల భారత్ కోస్టల్ జిల్లాల్లో అధిక నష్టం సంభవించిందని పేర్కొన్నారు. విపత్తులను సమర్థంగా ఎదుర్కోవడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సోషల్ మీడియా బలోపేతం, సామాజిక వ్యవస్థల నియామకం, రాష్ట్ర ఎన్.డి.ఆర్.ఎఫ్.సహాయం అవసరం ఉందన్నారు. ఐఎండీ మాజీ డైరెక్టర్ డాక్టర్ శరత్‌చంద్ర సాహు మాట్లాడుతూ ఈ ఏడాది వేసవిలో ఢిల్లీ వంటి మెట్రో నగరాల్లో 55 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయయని, భవిష్యత్తులో మనం మరిన్ని విపత్కర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రారు డాక్టర్ అనితా పాత్ర్ మాట్లాడుతూ ఒడిశాలో సూపర్ సైక్లోన్ తర్వాత ప్రతి జిల్లాలో ఓడ్రాఫ్ విభాగాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం వాతావరణ మార్పులు, విపత్తులను ఎదుర్కునేందుకు వినియోగించాల్సిన సాంకేతిక నైపుణ్యంపై పుస్తకాన్ని విడుదల చేశారు. ముఖ్యఅతిధులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో కో–కన్వీనరు డాక్టర్ మదన్ మోహన్ రౌత్, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ల పేరిట వసూళ్లు!

- పింఛన్ మంజూరు చేస్తామంటూ లబ్ధిదారుల నుంచి రూ.500 వసూలు
- 50 ఏళ్లు దాటిన పేదలకు కూటమి సభ్యులు లంచాల ఎర
- ప్రభుత్వ విధివిధానాలు రాకముందే వసూళ్లకు శ్రీకారం చుట్టిన తమ్ముళ్లు
- పాలవలసలో 100 మంది నుంచి రూ.500 చొప్పున వసూలు

గుర్ల: టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి నిండా నెల రోజులైంది. అప్పుడే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల నుంచి వసూళ్ల పర్వానికి తెర లేపారు కూటమి సభ్యులు. సంక్షేమ పథకాలు అందాలంటే కూటమి సభ్యులకు లంచాలు చెల్లించాలని చెబుతున్నారు. తాము చెప్పినప్పుడు నగదు అందించిన వారికే పథకాలు అందుతాయని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. దీంతో చేసేది లేక నగదు చెల్లించుకునే పరిస్థితి గుర్ల మండలంలోని పాలవలసలో చోటు చేసుకుంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా 50 ఏళ్లు నిండిన బీసీలకు పింఛన్ మంజూరు చేస్తామని చెప్పింది. దీనిని అనువుగా తీసుకున్న కూటమి కార్యకర్తలు గుర్ల మండలంలోని పాలవలసలో 50 ఏళ్లు నిండిన వారి నుంచి ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌లతో పాటు రూ.500 నగదు ఇచ్చిన వారికే పింఛన్ మంజూరు చేస్తామని వసూళ్ల పర్వానికి తెరలేపారు. పాలవలసలో సుమారు 150 మంది 50ఏళ్లు దాటిన వారు ఉంటారు. వారిలో ఇప్పటికే 100 మంది నుంచి రూ.500 నగదు వసూలు చేసినట్లు సమాచారం. 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్‌లు మంజూరుపై ప్రభుత్వం నేటి వరకు ఎటువంటి విధి విధానాలు ప్రకటించలేదు. అయినప్పటికి టీడీపీ నేతలు మాత్రం తమ సొంత విధి విధానాలను రూపొందించుకొని లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేస్తున్నారు. నగదు అందించిన వారికి వయస్సు తక్కువగా ఉన్న అధికారులను ఒప్పించి పింఛన్ మంజూరు చేస్తామని హామీ కూడా ఇస్తున్నారని గ్రామంలో ప్రచారం జరుగుతుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే వచ్చేవని వైఎస్సార్‌సీపీ నాయకులు చెబుతున్నారు. 50 ఏళ్ల దాటిన బీసీలకు పింఛన్ మంజూరుపై ప్రభుత్వం నేటి వరకు ఎటువంటి విధి విధానాలును ప్రకటించలేదని, లబ్ధిదారులు అనవసరంగా టీడీపీ నాయకులకు లంచాలు ఇచ్చి మోసపోవద్దని సోషల్ మీడియాలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు.

గంజాయి బ్యాచ్ హల్‌చల్

నెల్లిమర్ల: పట్టణంలో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తోంది. ప్రయాణికులపై దాడి చేసి డబ్బులు డిమాండ్ చేసింది. స్థానికులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక మొయిద జంక్షన్ చర్చి సమీపంలో రాత్రి సమయంలో గంజాయి బ్యాచ్ మొయిన్‌రోడ్డులో కారులో ప్రయాణం చేస్తున్న బాధిత కుటుంబంపై దాడి చేసి రూ.20వేలు డిమాండ్ చేసింది. బాధితుడు పాలకొల్లు నుంచి చీపురుపల్లి మండలంలోని ఇటకర్లపల్లిలో బంధువులు చనిపోవటంతో పరామర్శకు వెళ్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. డబ్బులు లేవని బాధితుడు చెప్పడంతో దుండగులు కారు అద్దాలు పగులగొట్టారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సునీల్‌కుమార్‌పై అక్రమ కేసులు ఎత్తేయాలి

- అంబేడ్కర్ ఇండియా మిషన్ డిమాండ్



ధర్నా చేస్తున్న అంబేడ్కర్ ఇండియా మిషన్ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్‌కుమార్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ జిల్లా కన్వీనర్ కెల్ల భీమారావు డిమాండ్ చేశారు. సునీల్‌కుమార్‌పై అక్రమ కేసును నిరసిస్తూ అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత అధికారులపై కూటమి ప్రభుత్వం వివక్ష మానుకోవాలన్నారు. సునీల్ కుమార్‌పై పెట్టిన అక్రమ కేసును ఉపసంహరించుకోవాలన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అంబేడ్కర్ మిషన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. సునీల్‌కుమార్‌కు జరుగుతున్న అన్యాయాన్ని దళితులు అంతా గమనిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లోపింటి లక్ష్మణరావు, సైనిక్ జిల్లా కన్వీనర్ గంధ్రేటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.